# వంతెన శిథిలం

- ప్రమాదభరితంగా ఏటిగట్టు రోడ్డు వంతెన
- ఇరుకుగా ఉన్న మార్గం
- ధ్వంసమైన రైలింగ్
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు

**కరప:** రైతులు, ప్రజలు రాకపోకలు సాగించే వంతెన శిథిలావస్థకు చేరింది. ఇరుకుగా ఉన్న రహదారి, రైయింగ్ ధ్వంసమై ప్రమాదకరంగా ఉంది. వాహనచోదుకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. అయినా ఆ వంతెనను అభివృద్ధి చేసేందుకు అధికారులు పట్టించుకోవడంలేదు.

**ఇదీ పరిస్థితి**

మండలంలోని గొర్రిపూడి గ్రామ సమీపంలో శహపురం డ్రైన్‌పై ఉన్న వంతెన శిథిలస్థితిలో ప్రమాద భరితంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణం చేస్తే, ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కరప, పెదపూడి మండలాల పరిధిలోని ఆరు గ్రామాల్లోని పంట పొలాల్లోని మురుగునీరు, ముంపునీరు శహపురం డ్రైన్ ద్వారా ప్రవహించి గొర్రిపూడి వద్ద తుల్యభాగ డ్రైన్‌లో కలుస్తుంది. తుల్యభాగ డ్రైన్‌లో కలిసేచోట శహపురం డ్రైన్‌పై వంతెన నిర్మించి, చాలా కాలమవడంతో శిథిలావస్థకు చేరింది. గొర్రిపూడి, వేములవాడ గ్రామాల మధ్య ఏటిగట్టు వెంబడి ఉండే రోడ్డు మార్గం ఈ వంతెన మీదుగా సాగుతోంది. కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాలను అనుసంధానం చేసే ఈవంతెన పై భాగంలో ఇరు వైపులా ఉండే రైలింగ్ పూర్తిగా ధ్వంసమయ్యాయి.

**ఇదే మార్గం**

మండలంలోని వేములవాడ, వలసపాకల, వాకాడ, కరప తదితర గ్రామాల వారు కాజులూరు మండలం వైపు, అటు కోటిపల్లి, ద్రాక్షారామ వెళ్లాలన్నా, మండల వాసులు తాళ్లరేవు రిజిస్ట్రార్ కార్యాలయానికెళ్లాలన్నా ఈ వంతెన నుంచే రాకపోకలు సాగించాలి. మండలంలోని గొర్రిపూడి, కొంగోడు, విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన కరప రావాలంటే ఇదే దగ్గర మార్గం. ఏటిగట్టు రోడ్డు ద్విచక్ర వాహనాలు, ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. రైలింగ్ దెబ్బతినడంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి కాలువలోకి పడిపోయే ప్రమాదముందని వాహనచోదకులు అంటున్నారు. రైలింగ్ ధ్వంసమై ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. వేములవాడ ఏటిగట్టు రోడ్డు రెండేళ్ల క్రితం ఆధునీకరించినా అప్పుడు ఈ వంతెన నిర్మాణం చేపట్టలేదని పలువురు ఆరోపిస్తున్నారు. శహపురం డ్రైన్‌పై ఉన్న వంతెనను పునర్నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని, లేదా రైలింగ్ అయినా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. రైలింగ్ ధ్వంసమవ్వడంతో రెండెడ్ల బండ్లు వెళ్లడానికి వీలులేక రైతులు పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. అధికారులు స్పందించి శహపురం డ్రైన్‌పై వంతెన నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.


శహపురం డ్రెయిన్‌పై రైలింగ్ ధ్వంసమై ప్రమాదభరితంగా ఉన్న వంతెన

### రైతులకు ఇబ్బందికరంగా ఉంటోంది

శహపురం డ్రైన్‌పై వంతెనకు ఇరువైపులా రైలింగ్ ధ్వంసమవ్వడంతో పంట ఉత్పత్తులు తెచ్చుకోవడానికి ఇబ్బందిపడుతున్నాం. వంతెనపై నుంచి రెండెడ్ల బండి వెళ్లేందుకు వీలులేక పంట ఉత్పత్తులు తెచ్చుకునేందుకు, అదనంగా ఖర్చుచేయాల్సి వస్తోంది. కరప, కాజులూరు, తాళ్లరేవు మండలాల ప్రజలు ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి వంతెన పునర్నిర్మించాలి.



– బండే వీరబాబు, వేములవాడ

## శక్తి టీమ్స్ ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

**కాకినాడ క్రైం:** కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్ శనివారం శక్తి టీమ్స్, యాప్, వాహనాలు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రత కోసం శక్తి బృందాలు, యాప్ అందుబాటులోకి వచ్చాయన్నారు. యాప్‌లో మహిళలు తమపై జరిగే వేధింపులు, అఘాయిత్యాలు, ఇతర హింసాత్మక సంఘటనలకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతి మహిళ విద్యార్థిని తమ ఫోన్‌లో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. జిల్లాలో 4 బృందాలుగా శక్తి టీమ్స్ పనిచేస్తాయన్నారు. ఈ సందర్భంగా శక్తి యాప్ లోగోను ట్రైనీ ఐపీఎస్‌లు సుస్మిత, జీవన ప్రారంభించారు. 30 పెట్రోలింగ్ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులు సంచరించే ప్రాంతాలను గుర్తించి డ్రోన్ నిఘా ఏర్పాటు చేయనున్నట్టు ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి పెద్ద సంఖ్యలో అంగన్వాడీ కార్యకర్తలతో పాటు అదనపు ఎస్పి శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎస్పి దేవరాజ్ మనీష్ పాటిల్, మహిళా పీఎస్ ఇన్‌స్పెక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రరావుతో పాటు అధికారులు పాల్గొన్నారు.

# నూతన ఆవిష్కరణలపై దృష్టి


సదస్సు సావనీర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

**బాలాజీచెరువు:** నూతన ఆవిష్కరణలపై సివిల్ విద్యార్థులు దృష్టి సారించాలని కాకినాడ సీపోర్టు డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సాధా-25 పేరుతో టెక్‌ఫెస్ట్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పరిశోధనలు, స్టార్టప్‌లకు టెక్‌ఫెస్ట్‌లు దోహదపడతాయని, ఆధునిక సాంకేతికతపై పట్టు సాధించాలని సూచించారు. జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ఇటువంటి ఫెస్ట్‌లు దోహదపడతాయయని, వచ్చే ఏడాది 1500 మంది సిట్టింగ్ సామర్థ్యం గల ఆడిటోరియం అందుబాటులోకి వస్తుందన్నారు. అనంతరం రవికుమార్‌ను సత్కరించగా సదస్సు సావనీర్ ఆవిష్కరించగా, విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు తిలకించారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి కోటేశ్వరరావు, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ రవీంద్ర, మాజీ వీజీ డాక్టర్‌జీవీఆర్ ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

# ఇంటర్‌మెడిక్స్ చెస్ చాంపియన్‌గా ఆర్‌ఎంసీ

క్రీడల్లో అదరగొట్టిన ఆర్‌ఎంసీ విద్యార్థులు


విజేతలను అభినందిస్తున్న డాక్టర్ నరసింహం, డాక్టర్ విష్ణువర్ధన్, బృందం

**కాకినాడ క్రైం:** డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్‌మెడిక్స్ క్రీడా పోటీల్లో కాకినాడ రంగరాయ వైద్య కళాశాల(ఆర్‌ఎంసీ) విద్యార్థులు అదరగొట్టారు. గన్నవరం పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజ్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు, 15 నుంచి 17వ తేదీ వరకూ రెండు దశల్లో ఈ పోటీలు జరిగాయి. 28 వైద్య కళాశాలలకు చెందిన 36 బృందాలు ఇంటర్‌మెడిక్స్ క్రీడా పోటీల్లో పాల్గొన్నాయి. చెస్, వాలిబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బాడ్మింటన్, ఫుట్‌బాల్ క్రీడల్లో ఈ పోటీలు జరగగా చెస్‌లో ఓవరాల్ చాంపియన్‌గా కాకినాడ ఆర్‌ఎంసీ టీం అవతరించింది. అలాగే వాలీబాల్, టెన్నిస్‌లో ఆర్‌ఎంసీ విద్యార్థులు మూడో స్థానం సాధించారు. ఈ సందర్భంగా విజేతలను డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ శనివారం కళాశాల ప్రాంగణంలో ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు అభినందనలు తెలిపిన వారిలో వైస్ ప్రిన్సిపాల్ అకడమిక్స్ డాక్టర్ శశి, స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ డాక్టర్ ఉమామహేశ్వర రావు, క్యాంపస్ ఇన్‌చార్జి సతీష్, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్‌రెడ్డి, డాక్టర్ అభిలాష్ తదితరులు ఉన్నారు.

## దీపు హంతకుడిని ఉరి తీయండి


దుర్గాప్రసాద్ చిత్రాన్ని దహనం చేస్తు నినాదాలు చేస్తున్న ట్రాన్స్‌జెండర్లు

**కాకినాడ క్రైం:** ఈ నెల 19న అనకాపల్లిలో అతి కిరాతకంగా ట్రాన్స్‌జెండర్ దీపుని హత్య చేసిన ఆమె ప్రియుడు దుర్గాప్రసాద్‌ను చట్టప్రకారం ఉరితీయాలని డిమాండ్ చేస్తూ ట్రాన్స్‌జెండర్లు కాకినాడ బాలాజీచెరువు జంక్షన్‌లో శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రేమ పేరుతో మభ్య పెట్టి ముక్కలుగా నరికి హతమార్చాడని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్గాప్రసాద్‌ను శిక్షించే వరకు నిరసన కొనసాగిస్తామని అన్నారు. ప్రభుత్వం తమ నిరసనపై సానుకూలంగా స్పందించి దీపుని 15 ముక్కలుగా నరికిన హంతకుడికి న్యాయస్థానంలో ఉరి శిక్ష పడేలా చొరవ చూపాలన్నారు. ట్రాన్స్‌జెండర్లపై అమానుష దాడులు, అమానవీయ చర్యలు నిత్యకృత్యమైపోయాయని, తమ రక్షణ కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా 220 మంది ట్రాన్స్‌జెండర్లు భానుగుడి కూడలి నుంచి బాలాజీ చెరువు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి, దీపు ఆత్మకి శాంతి చేకూరాలని కాంక్షిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన చేసి, మౌనం పాటించారు. దుర్గాప్రసాద్ చిత్రాన్ని దహనం చేసి నినాదాలు చేశారు. ట్రాన్స్‌జెండర్ల నిరసనకు ఛేంజెస్ సంస్థ మద్దతు తెలిపింది.

# కుల వృత్తుల వారికి మెరుగైన జీవనోపాధి

**కాకినాడ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం ఆదరణ-3 పథకం ద్వారా ఆధునిక పరికరాలు, పనిముట్లు అందించి బీసీ కుల వృత్తికారులకు మెరుగైన జీవనోపాధులను కల్పించనుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ పీజీఆర్ఎస్ హాలులో రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ, బీసీ కార్పొరేషన్ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లికార్జున, కలెక్టర్ షణ్మోహన్ సగిలితో సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీసీ కులవృత్తుల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయాల నిధులు కేటాయించి ఆదరణ-3 పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. వృత్తి పనుల్లో వచ్చిన ఆధునిక సాంకేతికతన బీసీ వృత్తికారులకు అందించి వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఆయా కుల వృత్తికారుల ప్రతినిధులతో చర్చించి, వారి సలహా సూచనలను సేకరించేందుకు ఆయా వృత్తుల సంఘాల ప్రతినిధులతో శనివారం కాకినాడలో వర్క్‌షాపు నిర్వహించామన్నారు. ఈ వర్కుషాపులో 26 వృత్తి సంఘాల నాయకులు పాల్గొని కాలానుగుణంగా వృత్తులలో పెరిగిన సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఆదరణ-3 పథకం నుంచి ఆధునిక పరికరాలను పంపిణీ చేయాలని సూచించారన్నారు. సబ్సిడీపై అందించే పరికరాలను గ్రూపుల విధానంలోను పంపణీ చేయాలని కోరరన్నారు. వృత్తికార సంఘాల ప్రతినిధులు సూచించిన సలహాలను, వ్యక్తం చేసిన సంశయాలను క్రోడీకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ ఎండీ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ 10 శాతం లబ్ధిదారుల వాటా, 90 శాతం ప్రభుత్వ సబ్సిడీతో అమలు చేసే ఆదరణ-3 పథకంలో లబ్ధిదారుల చాయిస్ ప్రకారం వారు కోరుకున్న పరికరాలను పంపిణీ చేస్తారన్నారు. కలెక్టర్ షణ్మోషన్ మాట్లాడుతూ వికాస సంస్థ ద్వారా నిర్వహిస్తున్న జాబ్‌మేళా, వేసవి నుంచి రక్షణ చేపడుతున్న చర్యలపై మీడియాకు వివరించారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి జిల్లా కార్యాలయ ప్రాంగణలో ఉన్న వికాస కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామన్నారు. వేసవిలో గ్రీష్మ తాపం నుంచి ప్రలకు రక్షణ కల్పించేందుకు జిల్లా అంతటా దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ షణ్మోహన్ వివరించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్ఎస్ భావన, వికాస పీడీ కె.లచ్చారావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, బీసీ సంక్షేమాధికారి ఎం.లల్లి తదితరులు పాల్గొన్నారు. మొదటి జిల్లా వెనుకబడిన తరగతుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదరణ-3 పథకంపై కులవృత్తి, చేతు వృత్తిదారులతో కలెక్టరేట్‌లో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి సత్యనారాయణ

## హుండీల లెక్కింపు


బాలాత్రిపురసుందరి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

**బోట్‌క్లబ్:** స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయ హుండీలను శనివారం దేవాదాయశాఖ అధికారులు సమక్షంలో లెక్కించారు. మూడు నెలల వ్యవధి రూ.1.14 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

**కుమారస్వామి ఆలయంలో..**

భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న వల్లీదేవసేన సమేత కుమారస్వామి హుండీలను శనివారం లెక్కించారు. రెండు సంవత్సరాలు వ్యవధిగాను రూ.20, 431 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు.

## సర్పవరం గోశాలకు గ్రాసం అందజేత


సర్పవరం గోశాలకు గడ్డిని అందజేస్తున్న ఆ గ్రామ రైతు సేవా సంఘం సభ్యులు

**కాకినాడ రూరల్:** సర్పవరం గ్రామంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయం గోశాలకు ఆ గ్రామ రైతు సేవా సంఘం ట్రాక్టరు ఎండు గడ్డిను అందజేశారు. గోశాలలో పశువులకు వేసవి వేళ గ్రాసం కొరత లేకుండా ఉండేందుకు గ్రామంలో రైతు సేవా సంఘం ఈ విధంగా వితరణ చేసినట్టు ఈఓ లక్ష్మీనారాయణ తెలియజేశారు.

# నెలాఖరులోగా ఫీజులు చెల్లించాలి


ఈవోల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా దేవదాయ శాఖాధికారి సుబ్బారావు

**బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ):** కాకినాడ జిల్లాలో దేవదాయశాఖకు చెల్లించాల్సిన ఫీజులు ఈ నెలాఖరులోగా చెల్లించాలని జిల్లా దేవదాయ శాఖాధికారి ఈవీ సుబ్బారావు ఆ శాఖ ఆలయ ఈవోలకు సూచించారు. కాకినాడలో బాలాత్రిపుర సుందరి ఆలయం కల్యాణమండపంలో శనివారం ఎండోమెంట్ అడ్మినిస్ట్రేటివ్ ఫండ్, కామన్‌గుడ్ ఫండ్, ఆడిట్ ఫీజు చెల్లింపులపై కాకినాడ జిల్లాలోని దేవాదాయశాఖ పరిధిలోని ఆలయ, సత్రం ఈవోలతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే పలువురు ఈవో పూర్తిగా చెల్లించారని, మిగిలిన ఈవోలు ఈ నెలాఖరులోగా చెల్లించకుంటే వారిపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం ఫీజులు చెల్లించని ఈవోల ఆయన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ తనిఖీదారు వడ్డి ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

# పోక్సోపై అవగాహన తప్పనిసరి


కరపలో పోక్సోచట్టాలపై అవగాహన కల్పిస్తున్న జడ్జి ప్రసన్నలక్ష్మి


సదస్సులో మాట్లాడుతున్న పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి

**కాకినాడ లీగల్:** పోక్సో,వివిధ చట్టాలపై అవగాహన అవసరమని ఉండాలని కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి అన్నారు. శనివారం స్థానికి పీఆర్ కళాశాలలో వివిధ చట్టాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ పోక్సో చట్టంతోపాటు వివిధ చట్టాలపై విద్యార్థులు అవగాహన ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశలను నిజం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఇంట్లో వాళ్లకు, పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

**చట్టాలపై అవగాహన ఉండాలి**

**కరప:** మహిళలు, బాలికలకు భద్రత కల్పించేందుకు ఎన్నో చట్టాలున్నాయని, వాటిని తెలుసుకోవాలని కాకినాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పోక్సో, ఇతర చట్టాల గురించి వివరించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెండో అదనపు సివిల్ జడ్జ్ ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ చిన్న వయసులోనే పిల్లల్లో పెరుగుతున్న నేర ప్రవృత్తి, పిల్లల్లో సినిమాలు, సోషల్ మీడియా ప్రభావంతో గాడి తప్పుతున్న బాల్యం గురించి, పోక్సో, వివిధ చట్టాల గురించి చెప్పారు, కరప ఎస్ఐ టి.సునీత మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పినమాట విని, బాగా చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు, ఎన్.ప్రసాద్‌కుమార్, వి.రామమోహన్, టి.శ్రీనివాస్, సీహెచ్ భారతి, బి.పుష్పలత, పీడీ బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 24న హాకీ క్రీడాకారుల ఎంపికలు

**నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ):** జిల్లా హాకీ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24న కాకినాడ జిల్లా క్రీడామైదానంలోని హాకీ మైదానంలో జిల్లాస్థాయి జూనియర్స్ బాలుర హాకీ జట్టు ఎంపికను నిర్వహిస్తున్నట్టు సంఘ ప్రతినిధి వి.రవిరాజు శనివారం తెలిపారు. ఈ ఎంపికలు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. 2006 జనవరి ఒకటి తరువాత పుట్టిన వారు ఈ ఎంపికలకు అర్హులని తెలిపారు. ఎంపికైన జట్టు వచ్చేనెల 6 నుంచి 9 వరకు సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే ఏపీ అంతర్ జిల్లా బాలుర జూనియర్స్ హాకీ పోటీలలో పాల్గొంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఎంపికలకు హాజరుకావాలని ఆయన కోరారు.

## ముగిసిన టాలీ శిక్షణ

**బాలాజీచెరువు:** జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ బిల్డింగ్ పీజీ బ్లాక్‌లో నాన్ టీచింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న టాలీపై శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ మనకు ఏదైనా ఒక అంశంపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే సరైన పద్ధతిలో విధులు నిర్వర్తించగలమన్నారు. వర్సిటీతోపాటు కళాశాలకు సంబంధించి కార్యకలాపాలన్నీ టాలీసాఫ్ట్‌వేర్‌పై చేయాలని సూచించారు. పేపర్‌లెస్ కార్యకలాపాలు చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఆ దిశగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని సూచించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ విభాగాధిపతి కోటేశ్వరరావు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరెక్టర్ సుబ్బారావు, సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘు, టి.భాను, విజికే కశ్యప్ పాల్గొన్నారు.

## ఎరేవ్నా 4.0 పోస్టర్ ఆవిష్కరణ

**కాకినాడ క్రైం:** ఈ ఏడాది జూలైలో కాకినాడలోని రంగరాయ వైద్య కళాశాలలో ప్రతిష్టాత్మకంగా జరగనున్న ఎరేవ్నా 4.0 వైద్య సదస్సు ప్రచార పోస్టర్‌ను డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ, ఏపీ డీఎంఈ, ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఆవిష్కరించారు. కాకినాడ ఆర్‌ఎంసీ ప్రాంగణంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ శశి, ఫోరెన్సిక్ హెచ్‌వోడీ ఉమామహేశ్వరరావు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గేట్ ర్యాంకర్ నాగకృష్ణ మాన్విత్ అభినందనలు

**బాలాజీచెరువు:** గ్రాడ్యుయేట్ అప్టిట్యూట్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్(గేట్-25) పరీక్షలో ప్రతిభ చూపి 889 స్కోర్‌తో ఆలిండియా 39వ ర్యాంక్‌ను నాగకృష్ణ మాన్విత్ సాధించారు. ఈ సందర్భంగా శనివారం కుటుంబ సభ్యులు, సన్నిహితులు అభినందించారు. బీటెక్ ఈసీఈ గ్రూప్‌లో నిట్ సూరత్‌లో అభ్యసిస్తున్నాడు. తండ్రి నురుకుర్తి మురళీశ్రీనివాస్ ప్రభుత్వ ఉపాధ్యాయులు, తల్లి శారద జూవాలజీ అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. కవల సోదరులు హర్షిత్ జీఎస్ఎల్ రాజానగరం, వర్షిత్ రంగరాయ వైద్యకళాశాలలో చదువుతున్నాడు.


నాగకృష్ణకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం

# క్లుప్తంగా

## పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


కార్మికులకు దుస్తులు అదజేస్తున్న వాకర్స్ సంఘ అధ్యక్షుడు రత్న ప్రసాద్ తదితరులు

**కాకినాడ రూరల్:** సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ ఉద్యానవనంలో పారిశుధ్య కార్మికులకు వాకర్స్ సంఘం అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ శనివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర గిడ్డంగుల సంస్థ రిటైర్డ్ జనరల్ మేనేజరు ఐ.ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో వాకర్స్ సంఘ కార్యదర్శి డాక్టరు దాసరి శ్రీధర్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వినియోగించాలి

**బోట్‌క్లబ్:** నీటిని చాలా పొదుపుగా వినియోగించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ కార్యదర్శి చిట్ల కిరణ్ అన్నారు. స్థానిక సాయి భార్గవ స్కానింగ్ సెంటర్‌లో శనివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆసుపత్రుల సిబ్బందికి నీరు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. మంచినీటి వనరులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. వైద్యులు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయ సదస్సు

**బాలాజీచెరువు:** కేవలం ఉద్యోగ దృష్టితోనే కాకుండా స్వయం ఉపాధి దిశగా మేనేజ్‌మెంట్ విద్యార్థులు ఆలోచించాలని కాకినాడ గ్రామీణ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. ఐడియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ నిరుద్యోగ సమస్యకు పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం ఆలోచిస్తుందని, కాకినాడ రూరల్‌లో మూడు ఎంఎస్ఎంఈ కేంద్రాలు ఏర్పాటు చేశామని, మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి గణపతి, అకడమిక్ డైరెక్టర్ రంజిత్, ఏవో కేఎస్ వాసు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వైభవంగా జపయజ్ఞ పారాయణ


జపయజ్ఞ పారాయణలో పాల్గొన్న భక్తులు

**బోట్‌క్లబ్:** స్థానిక భోగిగణపతి పీఠంలో శనివారం సుప్రభాత వేళలో వజ్రకవచ స్తోత్రంతో వేంకటేశ్వరస్వామి వారికి 78వ జపయజ్ఞ పారాయణను శ్రీవారి సేవకులు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వర స్వామి వారికి 14వ శతాబ్దంలో తొండమాన్ చక్రవర్తి బంగారు తులసిదళాలు, 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవ రాయలు వజ్రకవచ ఆభరణాలతో పూజా కైంకర్యాలు చేయించి ధన్యులయ్యారన్నారు శ్రీవారి పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మరో రెండు జీబీఎస్ కేసులు

**కాకినాడ క్రైం:** కాకినాడ జీజీహెచ్‌లో శనివారం మరో రెండు జీబీఎస్(గులియన్ బరే సిండ్రోమ్) కేసులు నమోదయ్యాయి. దీంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల సంఖ్య ఐదుకి చేరింది. ప్రత్యేక వైద్య బృందాలు బాధితులకు సేవలందిస్తున్నాయి. బాధితుల్లో ఎవరికీ ప్రాణాపాయం లేదని వైద్యులు వెల్లడించారు.

## గ్రామాల్లో పన్నుల వసూలుకు స్పెషల్ డ్రైవ్

**కాకినాడ రూరల్:** పన్నుల వసూలుకు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామని ఈఓ పీఆర్ అండ్‌ఆర్డీ రామాంజనేయులు తెలియజేశారు. ఇంద్రపాలెం గ్రామంలో శనివారం ఇంటి పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలులో పాల్గొన్నారు. ఈ నెలాఖలోలోగా ఇంటి పన్నులు నూరు శాతం వసూలు చేసే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. కాకినాడ రూరల్‌లోని 18 గ్రామాల ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి సహకరించాలన్నారు.

## ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**బాలాజీచెరువు:** ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీసెట్ ప్రవేశపరీక్ష ఉచిత కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి జీజీకే నూకరాజు పేర్కొన్నారు. ఈఏపీ సెట్ పరీక్షకు మెటీరియల్ పైడా వెంకటనారాయణ చారిట్రబుల్ ట్రస్ట్ సహకారం చేస్తుండగా, ఓఎన్‌జీసీ సూపర్-30 ద్వారా జేఈఈ, నీట్‌లలో ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నామన్నారు. కోచింగ్‌తో పాటు భోజన సదుపాయం ఉందన్నారు. ఆసక్తి ఉన్న వారు పీఆర్ జూనియర్ కళాశాలలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతుల రాంబాబు, మేనేజర్ డి.రామకృష్ణ పాల్గొన్నారు.

## పాత్రికేయుడికి పరామర్శ

**కరప:** గొడ్డటిపాలెం గ్రామానికి చెందిన పాత్రికేయుడు పలివెల రమేష్ తల్లి ఇటీవల మరణించగా శనివారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, టీడీపీ నాయకుడు పిల్లి సత్తిబాబు, నాయకు పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.